ప్రకృతి పండుగ హోలీ

అందరూ ఆనందంగా జరుపుకోవాలి: కేసీఆర్

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): హోలీ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు. నిత్య జీవనంలోని కష్టాలను కాసేపు మరిచి, వయోభేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి కేరింతలతో ఆనందోత్సాహాల నడుమ రంగులతో జరుపుకునే ప్రకృతి పండుగ హోలీ అని గుర్తుచేశారు. ఈ పండుగ భారతీయ సామాజిక, సాంస్కృతిక జీవన ప్రత్యేకతను చాటుతుందని పేర్కొన్నారు. వసంతాన్ని తమ జీవితాల్లోకి ఆహ్వానిస్తూ జరుపుకునే హోలీ పర్వదిన సందర్భంగా ప్రకృతిమాత ప్రజలందరినీ చల్లగా చూడాలని కేసీఆర్ ప్రార్థించారు. హోలీ సందర్భంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ తదితరులు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఒకే రాష్ట్రం.. రెండురకాల అడ్మిషన్లు

- స్కూల్ అడ్మిషన్ల వయసు విషయంలో గందరగోళం
- 'స్టేట్' స్కూళ్లలో ఐదేండ్లు, సీబీఎస్ఈలో ఆరేండ్లు
- పలుమార్లు కేంద్రం లేఖలు రాసినా స్పందించని ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): ఒకే రాష్ట్రంలోని పాఠశాలల్లో ఒకటో తరగతి అడ్మిషన్ల వయసు విషయంలో రెండు విధానాలు అమలవుతున్నాయి. స్టేట్ సిలబస్ స్కూళ్లకేమో ఐదేండ్లు, సీబీఎస్ఈ సిలబస్ స్కూళ్లలో ఆరేండ్లకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇది 2024-25 విద్యా సంవత్సరంలో తమ పిల్లలను ఒకటో తరగతిలో చేర్చాలని చూస్తున్న తల్లిదండ్రులకు ఎదురవుతున్న సంకట స్థితి. ఎన్ఈపీలో భాగంగా 5+3+3+4 విద్యా విధానాన్ని కేంద్రం ప్రతిపాదించింది. దీంతో పూర్వ ప్రాథమిక విద్యలో పీ1, పీ2, పీ3, ఒకటి, రెండు తరగతులు చేరాయి. ఈ నేపథ్యంలోనే ఒకటో తరగతి ప్రవేశాలకు ఆరేండ్లుగా కేంద్రం నిర్దేశించింది. సీబీఎస్ఈకి అనుబంధంగా గల కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ, ఇతర ప్రైవేట్ పాఠశాలలు ఒకటో తరగతిలో చేరేందుకు ఆరేండ్లు ఉండాలన్న నిబంధనను పాటిస్తున్నాయి. ఈ ఏడాది జూబ్లీహిల్స్‌లోని ఓ సీబీఎస్ఈ పాఠశాల ఎల్‌కేజీలో 160 మంది విద్యార్థులను చేర్చుకున్నది. తీరా కేంద్రం హెచ్చరికలతో ఆయా విద్యార్థులను నర్సరీలోకి మార్చింది.

విడుదలకానున్న 5 వేల కోట్ల నిధులు

ఎన్ఈపీ అమలు చేస్తే కేంద్రం రూ.5 వేల కోట్ల వరకు నిధులను రాష్ట్రానికి విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ఎస్ఈపీ సహా ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ, ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్ (ఈసీఈ) సహా కార్యక్రమాల అమలుతో ఆయా నిధులు వచ్చే అవకాశం ఉన్నదని అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో ఎన్ఈపీ అమలుపై అధ్యయనానికి గతంలోనే విద్యాశాఖ నలుగురితో కమిటీని నియమించగా, రాష్ట్రంలో ఒకటో తరగతి ప్రవేశాలకు ఆరేండ్లు ఉండాలని సిఫారసు చేసింది.

8 రాష్ట్రాల్లో అమలుకాని ఎన్ఈపీ

దేశంలో తెలంగాణ సహా 8 రాష్ట్రాలు ఎన్ఈపీని అమలు చేయడం లేదు. ఈ నేపథ్యంలోనే ఆరేండ్లకు ప్రవేశాలు కల్పించేందుకు చొరవ తీసుకోవాలని ఇటీవలే కేంద్రం అన్ని రాష్ట్రాలకు లేఖలు రాసింది. ఏడాదికాలంగా కేంద్రం లేఖలు రాస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్రంలో ఆరేండ్ల వయో పరిమితిని అమలు చేయాలంటే రెండు జీవోలను సవరించాల్సి ఉంటుంది. జీవో-5, జీవో-20 ప్రకారం ఐదేండ్లుగా నిర్ధారించారు.

రైతన్నలకు లీగల్ నోటీసులా?

- సర్కారుది మోసం.. నయవంచన?
- సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): 'రైతన్నలకు లీగల్ నోటీసులు. ఇంత మోసం, పచ్చి దగా, నయవంచన' అని కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు రైతులెవ్వరూ రుణాలు చెల్లించొద్దని, ఏర్పడేది తమ ప్రభుత్వమేనని చెప్పిన రేవంత్‌రెడ్డి రైతులను వంచించారని ఆయన ఆదివారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానాలను గుర్తుచేస్తూ నాడు, నేడు పేరుతో కేటీఆర్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 'ఇవి ఎన్నికలకు ముందు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు. బ్యాంకుల్లో రుణాలున్న రైతులెవ్వరూ రూపాయి కట్టొద్దు. డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డిసెంబర్ తొమ్మిదినాడు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తాం. ఇప్పటివరకు లోన్ తీసుకోనోళ్లు పోయి తెచ్చుకోండి. తీసుకున్నోళ్లకు మా ప్రభుత్వం రుణమాఫీ చేశాక బ్యాంకోళ్లు మళ్లీ లోన్లు ఇస్తరు' అని పేర్కొన్న సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులను మోసం చేసిందని దుయ్యబట్టారు. 'పంట రుణాలపై కాంగ్రెస్ సర్కారు మౌనం. రైతన్నలకు లీగల్ నోటీసులు. ఇంత మోసం, పచ్చి దగా, నయవంచన' అని 'రైతులకు లీగల్ నోటీసులు' అన్న నమస్తే తెలంగాణ కథనాన్ని కేటీఆర్ ట్వీట్ చేయటం గమనార్హం.

లోకం పోకడ



ఒంటిమీద రంగులు పడ్డాయి గానీ,
బిందెలో చుక్క మంచినీరు పడలే!

ఎండిన పంటలకు మొండిచెయ్యి!

అకాల వర్షాలతోనే పంటలకు నష్టమా? • సాగు నీళ్లు లేక ఎండితే నష్టం కాదా?

- సర్కారు సర్వేపై అన్నదాతల ఆగ్రహం
- ఎండిన పంటలకు పెట్టుబడి కాలేదా?
- నష్టపోయిన ప్రతి పంటకూ పరిహారం ఇవ్వాలని రైతుల డిమాండ్

హైదరాబాద్, మార్చి 24(నమస్తే తెలంగాణ) : ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదంటారు. యాసంగిలో రైతుపై పాలకులతో పాటు ప్రకృతి కూడా పగబట్టింది. ప్రాజెక్టుల గేట్లు ఎత్తక కాంగ్రెస్ తెచ్చిన కరువుతో సాగునీళ్లు కరువై పంటలు ఎండిపోయాయి. బావి, బోరు నీళ్లతోపాటు ట్యాంకర్లు, కిలో మీటర్ల కొద్దీ పైపులైన్లు వేసుకుని అరిగోస పడి కాపాడుకున్న కాసింత పంటలు కూడా అకాల వర్షాలకు ఆగమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా వడగండ్ల వానలు రైతులకు కడగండ్లు మిగిల్చాయి. కరువు ఒక వైపు, అకాల వర్షాలు మరో వైపు అన్నదాతలను కోలుకోని దెబ్బతీశాయి. పంటలు కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న రైతులకు భరోసా ఇవ్వాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం విషయంలో పరిహాసమాడుతున్నది. కేవలం అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు మాత్రమే పరిహారం ఇస్తామని ప్రకటించింది. ఈ మేరకు పంట నష్టం సర్వే చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేసింది. కానీ నీళ్లు లేక ఎండిపోయిన పంటలపై మాత్రం ప్రభుత్వం ఇప్పటి వరకు నోరు మెదపలేదు. వర్షాలతో దెబ్బతింటేనే పంట నష్టమా ? .. నీళ్లు లేక పంటలు ఎండిపోతే నష్టం కాదా ? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎండిన పంటల సాగుకు పెట్టుబడి పెట్టలేదా ? అని నిలదీస్తున్నారు.

కరువు కాటే ఎక్కువ

ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వడగండ్ల వానతో సుమారు 50 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే చేసిన తరువాత వాస్తవ నష్టంపై స్పష్టత వస్తుంది. అయితే రాష్ట్రంలో వడగండ్లతో జరిగిన నష్టం కంటే కాంగ్రెస్ తెచ్చిన కరువు కాటే ఎక్కువగా ఉన్నది. సాగునీళ్లు కరువై పంటలు ఎండిపోయి రైతులకు తీరని నష్టం జరిగింది. ఈ యాసంగిలో 66 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో సుమారు 30 శాతం పంటలు సాగునీళ్లు లేక ఎండిపోతున్నట్టు అంచనాలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 15 లక్షల ఎకరాల్లో వరి పంట ఎండిపోయినట్లు సమాచారం. వచ్చే నెల రోజుల్లో మరో 5 -10 లక్షల ఎకరాల్లో వరి పంట ఎండిపోయే ప్రమాదం ఉంది. అంటే ఈ ఒక్క సీజన్‌లోనే ఒక్క వరి పంటనే 20-25 లక్షల ఎకరాల్లో ఎండిపోతుండడం గమనార్హం. ఈ విధంగా వర్షాలతో తక్కువ నష్టం జరిగితే సాగునీళ్లు లేక ఎండిన పంటలతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది.

కాంగ్రెస్ మార్క్ పరిహారం

పంట నష్ట పరిహారం అందించడంలోనూ కాంగ్రెస్ సర్కారు తన మార్క్ రాజకీయం చేస్తుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కరువుతో పోల్చుకుంటే వర్షాలతో జరిగిన నష్టం చాలా తక్కువే. కాంగ్రెస్ మంత్రులు కరువు రైతులను గాలికొదిలి.. వడగండ్ల రైతులను ఆదుకుంటామంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. దీనిపై పంటలు ఎండిపోయిన రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆలోచనను తప్పుపడుతూ.. నష్టం ఏ విధంగా జరిగినా నష్టమే అనే కనీస విజ్ఞత ప్రభుత్వానికి లేదా అని మండిపడుతున్నారు. తక్కువ మంది రైతులకు ఎంతో కొంత పరిహారం అందించి సర్కారు చేతులు దులిపేసుకోవాలని చూస్తుందని విమర్శిస్తున్నారు. ప్రభుత్వానికి రైతులపై ప్రేమ, వారిని ఆదుకోవాలనే చిత్తశుద్ధి ఉంటే వడగండ్లతో పాటు సాగునీళ్లు లేక పంటలు ఎండిపోయిన రైతులకు కూడా పరిహారం అందించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఎండిన పంట నష్టంపై వెంటనే సర్వే చేయాలని రైతులు పట్టుపడుతున్నారు.

మేమేం పాపం చేశాం

సాగునీరందక పంట ఎండిపోయి రోదిస్తున్న రైతులం... మేమేం పాపం చేశాం. ప్రభుత్వం మమ్మల్ని ఎందుకు ఆదుకోదు. ఇంకొక తడికి నీరందితే పంట మొత్తం చేతికందేది. అలాంటిది పూర్తిగా ఎండిపోయిన పంటలతో ఎక్కువ నష్టం వాటిల్లింది. పంటను కాపాడుకోవడానికి పెట్టుబడి పెరిగింది. కానీ ఫలితం దక్కలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట ఎండిపోయిన రైతులకు కూడా నష్టపరిహారం అందించాలి.

- శేఖర్‌రెడ్డి, దుబ్బాక, నిజామాబాద్ జిల్లా

ఎకరాకు 20 వేలు ఇవ్వాలి

20 ఏండ్లుగా కౌలుకు చేసే పొలంలో ఎన్నడూ బావి ఎండిపోలేదు. ఈ సారి ఎండిపోయింది. నాలుగెకరాలు పూర్తిగా ఎండింది. మిగిలిన రెండెకరాలకు మూడ్రోజులకోసారి తడి కడుతున్నాం. పంట వచ్చేదాక అనుమానమే. ప్రభుత్వం నష్టపరిహారం కింద ఎకరాకు రూ.20 వేల చొప్పున చెల్లిస్తే తప్ప బతికే రోజులు లేవు.

- గంధమల్ల అయోధ్య, త్రిపురారం, నల్లగొండ

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	41.0°c	19.4°c
రంగారెడ్డి	39.7°c	21.2°c
మెదక్	39.4°c	23.1°c
ఖమ్మం	39.0°c	26.0°c
మహబూబ్‌నగర్	38.7°c	24.7°c
నిజామాబాద్	38.5°c	25.6°c
హైదరాబాద్	37.2°c	26.7°c
వరంగల్	37.0°c	24.0°c
నల్లగొండ	37.0°c	23.0°c
కరీంనగర్	36.0°c	25.0°c

కరీంనగర్ జిల్లా కొండన్నపల్లి వద్ద నీటి మట్టం తగ్గడంతో వరదకాలువలో నీళ్లు లేక తేలిన మోటార్లు

గంగాధర.. గంగ ఎటు పాయె

- పొట్ట దశలో ఉన్న పంటలు
- వరద కాలువలో తగ్గిన నీటి మట్టం
- గుంతలు తవ్వి నీళ్లు పారిస్తున్న రైతులు

గంగాధర, మార్చి 24 : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మొగులు ముఖం చూడకుండా పంటలు పండించిన రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నేలచూపులు చూస్తున్నారు. జీవనదిలా పారిన వరదకాలువలో నీటి జాడ కనిపించకపోయే సరికి రైతులు బెంబేలెత్తిపోతున్నారు. నిరుడులాగే నీళ్లొస్తాయని సాగు చేసిన రైతుల ఆశలన్నీ అడియాశలయ్యాయి. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టు, ఎస్సారెస్పీ పునర్జీవ పథకంతో కరువన్నదే ఎరుగరు. గలగలా పారే వరద కాలువలో నీటి మట్టం గణనీయంగా తగ్గిపోవడంతో మోటర్లు పైకి తేలాయి. పంటలను కాపాడుకోవడానికి వరదకాలువలో గుంతలు తవ్వి నీరందిస్తున్నారు.

28 కి.మీ. కాలువ...

గంగాధర మండలంలో 12 గ్రామాలను తాకుతూ దాదాపు 28 కిలోమీటర్ల మేర వరద కాలువ విస్తరించి ఉంది. దీనిపై ఆధారపడి దాదాపు 15 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రీ పంపుహౌజ్ నుంచి నీటిని వరదకాలువకు విడుదల చేయడంతో జీవనదిలా మారింది. దీంతో ఆయా గ్రామాల రైతులు వరదకాలువలో మోటర్లు వేసుకుని పంటలకు నీరు అందించుకునేవారు. ఏడాది పొడవునా వరదకాలువలో నీరు ఉండడంతో ఐదేండ్లుగా వర్షాల కోసం ఎదురుచూడకుండా రైతులు పంటలు సాగు చేసుకున్నారు. కానీ, ప్రస్తుతం పరిస్థితి మారింది. యాసంగి సాగు చేసిన రైతులు పొట్ట దశలో ఉన్న పంటలను కాపాడుకోడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. వరదకాలువలో గోతులు తవ్వి అందులో మోటర్లు పెట్టి పంటలకు సాగు నీరు అందిస్తున్నారు. మోటర్ పంపుసెట్టుకు నీరు అందకపోవడంతో అదనంగా పైపులు వేస్తూ నీటిని పారించడానికి ప్రయత్నిస్తున్నారు. మరో నాలుగైదు రోజులు ఇలాగే కొనసాగితే పరిస్థితి చెయ్యిదాటి పోతుందని, పంటలు చేతికివచ్చే అవకాశం లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీళ్లు ఉంటేనే పంట

ఐదేండ్లుగా వ్యవసాయానికి నీటి కరువు చూడలేదు. ఏడాది పొడవునా వరదకాలువలో నీరు ఉంది. ఇప్పుడు కాలువల నీళ్లు తగ్గి గుంతలు తవ్వి, పైపులు ఎక్కువ వేసి పొలానికి నీళ్లు పారించుకుంటున్నాం. ఇంకో పది రోజులు నీళ్లు ఉంటే బయట పడుతం. లేదంటే పంట చేతికి వచ్చుడు కష్టమే.

- తొర్రికొండ కిషన్, కొండన్నపల్లి, గంగాధర మండలం, కరీంనగర్ జిల్లా

గుంతలు తవ్వుతున్నం

మాకున్న రెండెకరాల్లో వరి పంట సాగు చేసిన. వరదకాలువలో గుంతలు తవ్వి పొలానికి నీళ్లు పారిచ్చుడు అయితది. ఐదేండ్లలో ఒక్కసారి కూడా వరదకాలువలకు దిగలేదు. ఇప్పుడు మోటర్లు పైకి తేలినయి. నీళ్లు అందక పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని కాలువలకు దిగి, గుంతలు తవ్వి నీళ్లు పెడుతున్నం.

- దూస సతీశ్, కొండన్నపల్లి, గంగాధర మండలం, కరీంనగర్ జిల్లా

తప్పుడు కథనాలపై క్రిమినల్ కేసులు

మొదటిపేజీ తరువాయి...

మండిపడ్డారు. తమపై గుడ్డి వ్యతిరేకత వల్లనో లేదా అధికార పార్టీ ఇచ్చే డబ్బులకు ఆశపడో ఇలాంటి నేరపూరితమైన, చట్టవిరుద్ధమైన వీడియోలను, ఫేక్ న్యూస్‌లను ప్రచారం చేస్తున్నాయని ఫైరయ్యారు. వ్యక్తిగతంగా తనతోపాటు తమ పార్టీని దెబ్బతీయాలన్న కుట్రలో భాగంగానే ఇదంగా జరుగుతున్నట్టు భావిస్తున్నామని తెలిపారు. ప్రజలను అయోమయానికి గురిచేసి, తప్పుదోవ పట్టించేందుకు చేస్తున్న చర్యగా తాము భావిస్తున్నట్టు పేర్కొన్నారు.

అసత్య ప్రచారాలు చేసే యూట్యూబ్ చానళ్లను నిషేధించాలి

గతంలో తమపై అవాస్తవాలను ప్రసారం చేసిన, ప్రచురించిన మీడియా సంస్థలపైన న్యాయపరమైన చర్యలు ప్రారంభించామని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రస్తుతం కొన్ని యూట్యూబ్ చానల్స్ చేస్తున్న దుర్మార్గపూరిత, కుట్రపూరిత చర్యలను చట్టబద్ధంగా ఎదుర్కొంటామని తెలిపారు. ఆయా చానళ్లను నిషేధించాలని యూట్యూబ్‌కు అధికారికంగా ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ తీరు మార్చుకోవాలని ఆయన సూచించారు. కుట్రపూరితంగా వ్యవహారం నడిపే యూట్యూబ్ చానళ్లు చట్టప్రకారం తగిన శిక్షకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఇటువంటి కుట్రపూరిత చానళ్ల ప్రాపగాండ, అసత్య ప్రచారం పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

- **ప్రజల మనిషి సుధాకర్‌రావు**

పాలకుర్తి ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌రావు నిత్యం ఆరాటపడేవారని మాజీ మంత్రులు హరీశ్‌రావు, దయాకర్‌రావు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా వడ్డెకొత్తపల్లిలో ఆదివారం సుధాకర్‌రావు సంతాప సభలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రామచంద్రునాయక్, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, నేతలు కొప్పుల ఈశ్వర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ చైర్మన్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

- పెద్దవంగర



జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్‌లో ఆత్మహత్య చేసుకున్న రైతు రఘుపతి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

రైతును బలి తీసుకుంటే చర్యలేవి?

- రఘుపతి వద్ద తీసుకున్న డబ్బులు ఆ అధికారికి తిరిగి ఇవ్వాలి
- ఆ భూమిని వెంటనే పట్టాగా ఎక్కించాలి
- లేకుంటే తహసీల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం: జనగామ ఎమ్మెల్యే పల్లా

బచ్చన్నపేట, మార్చి 24: జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్‌కు చెందిన రైతు రఘుపతిని పొట్టన పెట్టుకున్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతు వద్ద తీసుకున్న డబ్బులను వెంటనే తిరిగి ఇవ్వాలని, సదరు భూమిని రికార్డుల్లో ఎక్కించాలన్నారు. ఆదివారం ఆయన పడమటికేశ్వాపూర్ గ్రామానికి వెళ్లి రఘుపతి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ.. రైతు రఘుపతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని అన్నారు. భూమి రికార్డుల్లోకి ఎక్కక పోవడంతోనే రఘుపతి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. అధికారులకు డబ్బులు ఇచ్చి 18 నెలలు అవుతున్నా ఆ భూమి రికార్డుల్లోకి ఎక్కకపోగా మరిన్ని డబ్బులు అడగడంతో తీవ్ర మనస్తాపంతో రైతు ఆత్మహత్య చేసుకున్నట్టు చెప్పారు. ప్రభుత్వం మారిన తర్వాత రెవెన్యూ అధికారులు డబ్బులకు కక్కుర్తి పడుతున్నారని ఆరోపించారు. ఎక్కువ మొత్తంలో లంచాలు అడుగుతూ రైతులను పీడిస్తున్నారని విమర్శించారు. ధరణి ద్వారా 95 శాతం సమస్యలు పరిష్కారమయ్యాయని అన్నారు. కేవలం మిగిలిన రైతుల భూములకు సంబంధించి సమస్యలు ఉన్నా అవి ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరించడం లేదని విమర్శించారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పెట్టి సమస్యలను గుర్తిస్తామని కాంగ్రెస్ సర్కార్ చెప్పినా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. రైతు రఘుపతి వద్ద డబ్బులు తీసుకున్న సీనియర్ అసిస్టెంట్ సుమన్, సర్వేయర్ రవీందర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రైతు కుటుంబానికి బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

బక్క రైతును బలిపెడ్తరా?

మొదటిపేజీ తరువాయి...

వ్యవసాయం చేసిన రైతులు రేవంత్ సర్కారులో నిండా మునిగారు. ఎకరాల కొద్దీ నాటు పెట్టినా దొయ్యలు పారడం లేదనే రైతుల ఆవేదనను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీరు లేక 20 లక్షల ఎకరాలు ఎండిపోగా, వడగండ్లతో లక్ష ఎకరాల్లో నష్టం జరిగింది. ప్రతిపక్షాల ఇండ్లకు జొర్రి వారిని గంగిరెద్దుల్లా ఎత్తుకెళ్తున్న అధికారపక్ష నాయకులకు, రైతుల ఇండ్లకు వెళ్లి ఓదార్చే ఓపిక లేకపోయింది. నదుల్లో నీరున్నా నీటి నిర్వహణ చేయలేని ఈ ప్రభుత్వం యాసంగి వేళ రైతులకు కన్నీళ్లు మిగిల్చింది. ప్రభుత్వ వైఫల్యంతో పంటలు ఎండుతున్నాయి. పార్టీ గేట్లు తెరిచామని చెప్పుకుంటున్న రేవంత్ సర్కారు.. ప్రాజెక్టుల గేట్లు తెరవలేకపోతున్నది. ఒక్కో రైతు గాథలు వింటుంటే ఏడుపు వస్తున్నది. బక్క పలచని గిరిజన రైతులు నీరులేక తమ పంటలు ఎండుతుంటే చూడలేక మూడు నాలుగు బోర్లు వేసి లక్షల్లో డబ్బు ఖర్చు చేశారు. ఈ డబ్బులు మిత్తికి తెచ్చి పెట్టామని చెబుతుంటే నీరుండీ ఇవ్వలేని ఈ సర్కారును ఏమనాలి?' అని ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఆరు గ్యారెంటీలు దేవుడెరుగు, ఎన్నికల్లో రైతులకిచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేని ఈ ప్రభుత్వానికి రైతుల ఉసురు తాకుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన రైతుబంధు అమలు కాకపోగా, ఉన్న రైతుబంధు నేటికి రైతుల ఖాతాల్లో పడటం లేదని గిరిజన రైతులు చెప్పడం ఈ సర్కారు పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. రూ.2 లక్షల రుణమాఫీకి అతీగతి లేదని, రైతుకూలీలకు ఇస్తామన్న రూ.2,500 పింఛను ఎటుపోయిందని ప్రశ్నించారు.

ఎకరాకు 25 వేలు ఇవ్వాలి

సాగునీరు అందక ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బోర్లు వేసి, పంటలు ఎండి అప్పుల పాలై ఆత్మస్థైర్యాన్ని కోల్పోయిన రైతులకు ఈ నష్ట పరిహారంతో కొంతైనా ఓదార్పు ఉంటుందని తెలిపారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి బోర్లు వేసినా ఫలితం లేకపోవటంతో ఎండిన పంటచేనులో పశువులను మేపుతున్నారని గుర్తుచేశారు. పదేండ్లుగా కానరాని బోరుబండ్లు, పూడిక కేన్లు గ్రామాల్లో దర్శనమిస్తున్నాయని, మోటర్లు కాలుతున్నాయని తెలిపారు. యాసంగి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్, ఎండిన పంటకు నష్ట పరిహారం, రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు పూర్తిగా అమలు చేస్తేనే కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడగాలని అన్నారు. రైతుహామీలు అమలు చేయకపోతే, పంట నష్టం అందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చలో సెక్రటేరియేట్‌కు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల్లోపే ఈ హామీలు అమలుచేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయినం

హరీశ్‌రావు: యాసంగికి ఎన్ని ఎకరాలు నాటు పెట్టినవ్?

కున్సోతు నర్సింహ: నేడు 6 ఎకరాలు నాటు పెట్టిన సారు. 4 ఎకరాలు ఎండిపోతే పశువులను మేపిన. ఉన్న రెండెకరాలు పొట్టలమీద ఎండుతున్నది. రెండు దొయ్యలు పారుతున్నయ్. పొలం ఎండుతుందని రూ.4 లక్షలు మిత్తికి తెచ్చి 5 బోర్లు వేసిన. ఒక్కటీ పడలేదు.

హరీశ్‌రావు: ఇదివరకు ఎప్పుడన్నా పొలం ఎండిందా?

నర్సింహ: పదేండ్ల నుంచి ఎన్నడూ ఎండలే. అదే నమ్మకంతోని నాటుపెట్టిన. మంత్రి దయన్న ఉన్నపుడు రెండు కార్లు కాలువలు పారేది. చెరువులు నిండేది. బోర్లు ఫుల్ పోసేది. ఇప్పుడు పట్టించుకునేనాథుడే లేడు. ఎమ్మెల్యే యశస్విని నీళ్లు వదులతనన్నది. కానీ వదల్లేదు. పంట ఎండింది. ఇంత నీళ్ల కరువు ఎన్నడు చూడలె. కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయినం

హరీశ్‌రావు: నీళ్లుండీ ఇవ్వలేని ప్రభుత్వమిది. అధైర్యపడకు మంచిరోజులు వస్తయ్. ఎండిన వరికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి.

రెండు వేల కిలోల ద్రాక్షతో గణేశుడి ఆలయం ముస్తాబు

పుణె: మహారాష్ట్రలోని పుణెలో ప్రసిద్ధిగాంచిన దగడూ సేఠ్ వినాయక ఆలయం హోలీ సందర్భంగా ద్రాక్ష పండ్లతో ముస్తాబైంది. సుమారు 2 వేల కిలోల నలుపు, ఆకుపచ్చని ద్రాక్షలతో ఆదివారం ఆలయ ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దారు. సంకటహర చతుర్థి రోజున ద్రాక్ష మహోత్సవ్‌ను వైభవంగా జరుపుకుంటారు. గణపతి వద్ద ఉంచిన పండ్లను భక్తులు, పలు సంస్థలతో పాటు నసూన్ దవాఖాన, పితాశ్రీ వృద్ధాశ్రమాలకు పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

మరో ఐదురోజులు భగభగలు

మొదటిపేజీ తరువాయి...

చెప్పింది. హైదరాబాద్‌లోనూ వచ్చే ఐదు రోజులు ఎండల ప్రభావం తీవ్ర